

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



శ్రీలక్ష్మి ఆగ్రోటెక్ మిల్లును తనిఖీ చేస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఆత్మకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆత్మకూరు మండలంలోని శ్రీ లక్ష్మీ ఆగ్రోటెక్ రైస్ మిల్లును మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో తరుగు పేరుతో ధాన్యం కట్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, రైతుల నుంచి సేకరించిన ధాన్యం ట్రక్ షీట్లను పరిశీలించారు. రైస్ మిల్లులో 7 నుంచి 8 లారీలు నిలిచి ఉండటం చూసి హమాలీ కార్మికులను అధికంగా పిలిపించి తొందరగా అన్‌లోడింగ్ చేస్తే ట్రాన్స్‌పోర్టు సమస్య తలెత్తకుండా ఉంటుందని రైస్‌మిల్ యజమానికి సూచించారు. అనంతరం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మకూరు, అమరచింత ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ అధికారి జగన్మోహన్, ఆత్మకూరు తహసీల్దార్ చాంద్‌పాషా ఉన్నారు.

లారీల కోసం ఎదురు చూసి..
రోడ్డెక్కిన అన్నదాతలు



చీర్కపల్లిలో రోడ్డుపై చెట్టు కొమ్మలు ఉంచి రాస్తారోకో చేస్తున్న రైతులు

రేవల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): రోజుల తరబడి లారీల కోసం ఎదురు చూసిన రైతులు ఓపిక నశించి మంగళవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. వనపర్తి జిల్లా ఏదుల మండలంలోని చీర్కపల్లి గ్రామానికి చెందిన రైతులు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తరలించేందుకు లారీల కోసం ఎదురు చూశారు. వారాలు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో ఎన్ని రోజులు ధాన్యం దగ్గరే కాపలా ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపు అకాల వర్షాలు భయపెడుతున్నాయి, మరో వైపు వానకాలం సీజన్ పనులు చేసుకోకుండా ధాన్యానికి కాపాలానే ఉండాలా అంటూ రాస్తారోకో చేశారు. వనపర్తి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.బాల్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, జిల్లా నాయకులు రమేష్ రాస్తారోకోకు మద్దతు తెలిపారు. లారీలు వచ్చేంత వరకు ఇక్కడే ఉంటామని డిమాండ్ చేయడంతో పోలీసులు సంబంధిత అధికారులతో మాట్లాడించి మూడు లారీలను పిలిపించారు. దీంతో రాస్తారోకో విరమిస్తూ రైస్ మిల్లుల వద్ద తరుగు, తాలు పేరుతో ధాన్యాన్ని తీయొద్దని డిమాండ్ చేశారు.

మార్కండేయతో మారిన..
రూపురేఖలు



శాయిన్‌పల్లి సమీపంలో నిర్మించిన మార్కండేయ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పంప్ హౌస్

- రూ.78 కోట్లతో లిఫ్టు పనులు పూర్తి
- 7,500 ఎకరాలకు సాగు నీరు,
- బీడు భూములను తడుపుతున్న కృష్ణమ్మ
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

బిజినేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : 2014లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులను పూర్తి చేసి నీటి విడుదల ప్రారంభించారు. దీంతో బిజినేపల్లి మండంలోని ఎత్తైన ప్రాంతాల్లోని రైతుల రూపురేఖలు మారిపోయాయి. ప్రధాన కాలువలు పూర్తి అయిన డిస్ట్రిబ్యూటరీ కాలువలు, పిల్ల కాలువలు, అక్కడక్కడ బ్రిడ్జి పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ప్రాజెక్టు డిజైన్‌లో నీరు రాని ప్రాంతాలలో రైతులు తమకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల అభ్యర్థనలను పరిశీలించిన తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడుతూ బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి సమీపంలో రూ.78 కోట్ల అంచనా వ్యయంతో మార్కండేయ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి మమ్మాయిపల్లి, శాయిన్‌పల్లి, గంగారం, లట్టుపల్లి, పోలేపల్లి గ్రామాలతో పాటు 15 తండాలకు తాగునీరు, 7,500 ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ రూపొందించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత 2022లో పనులు ప్రారంభించి రెండేళ్ల కాలంలో భూసేకరణ, పంప్‌హౌజ్, పైప్‌లైన్, కాలువ నిర్మాణం, పంపుల పిట్టింగ్ చేపట్టి 2023 ఎన్నికల ముందు ట్రయల్ రన్ చేశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో మార్కండేయ లిఫ్టు పనుల కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆయకట్టు రైతులు, సంబంధిత గ్రామాల ప్రజలు ప్రస్తుత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసి తమ గోడు వెల్లబోసుకు న్నారు. మార్కండేయ లిఫ్టు ఇరిగేషన్ ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన పెండింగ్ పనులు, ప్యానల్ బోర్డులు ఫిట్టింగ్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు.

ఎత్తైన ప్రాంతాల్లో పచ్చని పంటలు

కేఎల్ఐ కాలువల కన్నా ఎత్తైన ప్రాంతంలో ఉన్న 5 గ్రామాలు, 15 తండాలకు సాగు, తాగునీరు లేక వలస బాట పట్టారు. కేఎల్ఐ పథకం ప్రధాన కాలువకు లిఫ్టు ఏర్పాటు చేసి నీటిని ఎత్తిపోసి దాదాపు 0.6 టీఎంసీ నీటితో చెరువులు, కుంటలు నింపాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం రూ.78 కోట్ల అంచన వ్యయంతో భూసేకరణ, ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకంలో భాగంగా బిజినేపల్లి మండలంలోని దాదాపు అన్ని గ్రామాలకు కేఎల్ఐ ద్వారా సాగునీరు ఇస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని భూములు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి.



మార్కండేయ లిఫ్టు వద్ద ప్యానల్ బోర్డు

తండాల్లో వలసలు తగ్గాయి



మార్కండేయ లిఫ్టు ద్వారా నీటిని విడుదల చేసిన తర్వాత తండాల్లో వలసలు తగ్గాయి. బీడు భూముల్లో పచ్చని పంటలు పండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నీటిని నిల్వ చేసుకునేందుకు రిజర్వాయర్ కెపాసిటీని పెంచితే రైతులకు పంటలు ఎండిపోకుండా ఉంటుంది.

- మస్కూరి అవంతి, మాజీ సర్పంచ్, శాయిన్‌పల్లి గ్రామం

లక్ష్యం మేరకు నీరందిస్తే వలసలు బంద్..

మార్కండేయ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి లక్ష్యం మేరకు నీరందిస్తే వలసలను నిలిపివేయవచ్చు అనే అభిప్రా యాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా మార్కండేయ లిఫ్టు పంపులను ప్రారంభించారు. చెరువులు, కుంటలు, మార్కండేయ రిజర్వాయర్‌ను 0.6 టీఎంసీల నీటితో నింపి పొలాలకు అందిస్తున్నారు. అలాగే కేఎల్ఐ ప్రధాన కాలువలో నీళ్లు పారుతున్నన్ని రోజులు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసుకొని వానకాలం, యాసంగి పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాగుకు..
సన్నద్ధం



ట్రాక్టర్ సాయంతో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

- గద్వాల జిల్లాలో 3.67 లక్షల ఎకరాలలో సాగు అంచనా
- ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- వేసవి దుక్కులు దున్నుతున్న రైతులు

గద్వాల, మే 20 (ఆంధ్రజ్యోతి): వానకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గతేడాది ఎడతెరపి లేని వర్షాలకు తెగుళ్లు తోడవటంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండుతాయనే ఆశతో రైతులు ఉన్నారు. వానకాలంలో రైతులు ఏయే పంటలు వేస్తారు, విత్తనాలు, ఎరువులు ఎంత అవసరమో అధికారులు నివేదికను తయారు చేసి ప్రణాళికను ప్రభుత్వానికి పంపించారు. ఈ ఏడాది అన్ని పంటలు కలిపి 3.67 లక్షల ఎకరాలలో సాగు చేస్తారనే అంచనాతో ఉన్నారు. ఇందుకోసం 1.18 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని నివేదిక తయారు చేశారు.

పత్తిసాగు వైపే మొగ్గు..

ఈ వానకాలంలో అన్ని పంటలు కలిపి 3.67లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు ప్రణాళికను తయారు చేశారు. అందులో పత్తి సాగుకే రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు గుర్తించారు. గత ఏడాది దిగుబడితో పాటు ధరపై తీవ్ర ప్రభావం చూపడంతో ఈ ఏడాది తక్కువగానే సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పత్తి 1.42 లక్షల ఎకరాలలో సాగు చేయవచ్చునని, ఆ తర్వాత వరి 96వేలు, కంది 43 వేలు, మొక్కజొన్న 13వేలు, వేరుశనగ 11 వేలు, మిరప 30వేల ఎకరాల్లో సాగుచేయనున్నారు. అదేవిధంగా కూరగాయలు పండ్లతోటలు 11వేలు, ఇతర పంటలు 21వేల ఎకరాలలో సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

అదేవిధంగా యూరియా 36,078 మెట్రిక్ టన్నులు, డీఏపీ 13,234, పొటాష్ 6,815, సూపర్ ఫాస్ఫేట్ 6,615, కాంప్లెక్స్ ఎరువులు 55,842 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇందులో యూరియా 15,442 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,694, సూపర్ ఫాస్ఫేట్ 759, పొటాష్ 1,738 కాంప్లెక్స్ ఎరువులు 18,009 ఇలా మొత్తం 37,644 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

మిగిలిన ఎరువులను కూడా అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఈ ఏడాదైన దిగుబడి వస్తుందని..

ఈ ఏడాదైన వాతావరణం అనుకూలించి మంచి దిగుబడులు వస్తాయనే నమ్మకంతో రైతులు వానాకాలం పంటలకు సిద్ధం అవుతున్నారు. ప్రతీసారి నష్టపోతున్నా.. ఈ ఏడాది బాగుంటుందని నమ్మకంతో రైతులు సాగుచేస్తుంటారు. అందుకే ఇప్పటికే వేసవి దుక్కులు ప్రారంభించారు. జూరాల ప్రాజెక్టు, నెట్టంపాడు కింద సాగు బాగుంటుందనే ఆశతోనే రైతులు ఉన్నారు. ఇప్పటికే బోరు బావుల కింద సాగు చేస్తున్న రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

ప్రణాళికలను సిద్ధం చేశాం



ఈ ఏడాది వానకాలంలో ఏయే పంటలు ఎంతమేరకు సాగు అవుతాయి, ఎరువులు, విత్తనాలు ఎంతమేర అవసరం అవుతాయో ప్రణాళిక సిద్ధం చేశాం. శాస్త్రవేత్తలతో పంటల సాగుపై అవగాహన కల్పించాం. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయనే నమ్మకం ఉంది.

- సక్రియా నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, గద్వాల

ఎన్నాళ్లిలా..?

- సొంతింటి కోసం పేదల ఎదురుచూపులు
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్రూం ఇళ్లు
- 90 శాతం నిర్మాణం పూర్తయినా పెండింగ్ పనులు పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



6

వందేభారత్ గద్వాలలో ఆగేనా?

- ఇప్పటికీ ఆగని నాలుగు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- ప్రయాణికులకు తప్పని ఎదురుచూపులు
- ఎంపీ డీకే అరుణ వినతితో ఆశలు



శబరి యాత్రకు వెళ్లి మహిళ మృతి



భారతమ్మ (ఫైల్)

రేవల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): శబరి యాత్రకు వెళ్లిన వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరాయిపాకుల గ్రామానికి చెందిన భారతమ్మ (55) అనే మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఏదుల రిజర్వాయర్ కింద బండరాయిపాకుల గ్రామం ముంపునకు గురైనప్పటి నుంచి ఆమె నాగర్‌కర్నూల్‌లో నివాసం ఉంటున్నారు. భారతమ్మ రెండు, మూడు రోజుల క్రితం తోటి మిత్రులతో కలిసి హైదరాబాద్ నుంచి శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా కాళ్లకు విద్యుత్ తీగలు తాకి విద్యుదాఘాతానికి గురై మరణించింది. ఆమె భర్త 15 సంవత్సరాల క్రితమే చనిపోయాడు. ఆమెకు కుమారుడు రంజిత్‌తో పాటు కూతురు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహం ఇంకా ఇంటికి చేరుకోలేదని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల అభివృద్ధి

- రాష్ట్రంలో 3.15 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ
- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి



మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యంలో పేదల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో మంగళవారం ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకంలో భాగంగా రేవంతన్న భరోసాలో 150 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్‌షాపుల్లో దొడ్డు బియ్యం ఇచ్చే వారని, ఇందిరమ్మ ప్రజాపాలనలో రాష్ట్రంలోని 3.17కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు కంటికి రెప్పలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను దశల వారీగా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బ్యాంగి ఆనంద్‌కుమార్, జడ్పీ మాజీ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, ఆర్డీవో శ్రీను, మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, ఎంపీడీవో వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

'వన్ నేషన్ వన్ ఎలక్షన్' నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు మాధవీలత

వనపర్తి విద్యావిభాగం, మే 20(ఆంధ్రజ్యోతి) : దేశంలో 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' నిర్వహిచాలని బీజేపీ నాయకురాలు మాధవీలత అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పార్లమెంటు, శాసనసభ, స్థానిక ఎన్నికలు విడివిడిగా నిర్వహించడం వల్ల లక్షల కోట్ల ప్రజాధనం వృథా అవుతోందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జమిలి ఎన్నికలు జరిగాయని, అదే పద్ధతిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తానంటే కాంగ్రెస్ పార్టీ అడ్డుపడుతుందని విమర్శించారు. దేశంలో ప్రతీ ఓటరుకు ఎలక్షన్ కమిషన్ రూ.1,475 ఖర్చు పెడుతుందని, పార్లమెంట్ ఎన్నికలకు ఆరు లక్షల కోట్లు, శాసన సభ ఎన్నికలకు మూడు లక్షల కోట్లు ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశ సత్తా మరోసారి ప్రపంచానికి తెలిసిందన్నారు. భారత ప్రభుత్వం పోరాటం టెర్రరిజం పైనే కానీ ముస్లింలపై కాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డీ నారాయణ, జిల్లా ఇన్‌చార్జి అహన్య రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆగని ఆర్థిక మోసాలు

- జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో అలజడి
- గత ఏడాది ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 50 కోట్లు కొల్లగొట్టిన సంస్థ
- తాజాగా రూ. కోటి అప్పు చేసి ఐపీ పెట్టిన వ్యాపారి

6



గతంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ లావాదేవీలు జరిగింది ఇక్కడే(ఫైల్)

జోగుళాంబ సన్నిధిలో ఐఏఎస్ అధికారి



ఐఏఎస్ అధికారి రజిత్ కుమార్ సైనికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఐదవ శక్తి పీఠం అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఐఏఎస్ అధికారి రజత్ కుమార్ సైనీ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేశారు. ప్రస్తుతం ఆయన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా సేవలంది స్తున్నారు. వారి వెంట తహసీల్దార్ మంజుల, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

భారత్ జోలికొస్తే సహించేది లేదు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి



నాగర్‌కర్నూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కందనూలు, మే 20 (ఆంధ్రజ్యోతి) : భారత్ జోలికొస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు అధ్యక్షత వహించారు. బీజేపీ నాయకులు భరత్‌ప్రసాద్, కట్ట సుధాకర్‌రెడ్డి, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజావర్ధన్‌రెడ్డి, పోల్‌దాస్ రాములుతో నాయకులు, కార్యకర్తలు జాతీయ పతకాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కూడలిలో దిలీపాచారి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం చేపట్టిన దాడులను అభినందించారు. భారత్ జోలికొస్తే తగిన రీతిలో గుణపాఠం చెప్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు.

తల్లి మృతిపై అనుమానం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమార్తె

నాగర్‌కర్నూల్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి) : తల్లి జలగరి శ్యామల (45) మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె కుమార్తె పుట్నాల పల్లవి ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న జలగరి శ్యామల ఈనెల 15న అనారోగ్యానికి గురయ్యింది. పక్కింటి వారు ఆమెను జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కాగా తన తల్లి మృతిపై అనుమానం ఉందని పేర్కొంటూ కుమార్తె పల్లవి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

భార్య,భర్తలపై దాడి

జడ్చర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : దంపతులపై దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన దంపతులు గంగారం బాలరాజు, ఆశమ్మలపై సోమవారం రాత్రి అదే కాలనీకి చెందిన నాగరాజు దాడి చేశాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. సంఘటనపై బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ఊర్కొండ, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనలో ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని గుడిగానిపల్లి గ్రామానికి చెందిన కృష్ణ కుమార్, బాల మైసయ్యల మధ్య సోమవారం రాత్రి వివాదం చెలరేగింది. సోమవారం రాత్రి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. అనంతరం ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వందేభారత్.. గద్వాలలో ఆగేనా?

- ఇప్పటికీ ఆగని నాలుగు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- ప్రయాణికులకు తప్పని ఎదురుచూపు
- ఎంపీ డీకే అరుణ వినతితో ఆశలు



గద్వాల రైల్వేస్టేషన్ ముఖచిత్రం



రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ డీకే అరుణ (ఫైల్)

గద్వాల అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : నిజాం పరిపాలన కాలంలో 112ఏళ్ల క్రితం మీటర్‌గేజ్ రైల్వేలేన్ ఏర్పాటైంది.... 32 ఏళ్ల క్రితం అప్పటి భారత ప్రధాని, తెలంగాణ వాసి పీవీ నరసింహారావు చొరవతో బ్రాడ్ గేజ్‌గా మారిన గద్వాల రైల్వేలైన్ 14 ఏళ్ల క్రితం కాచిగూడ-రాయచూర్ డెమో రాకతో జంక్షన్‌గా రూపాంతరం చెందింది. జంక్షన్‌గా మారిన గద్వాల రైల్వేస్టేషన్ ఇప్పటికీ ఈ మార్గం మీదుగా వెళ్లే నాలుగు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ లేకపోవడం తీరని కొరతగా మిగిలింది. దీనికి తోడు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వందేభారత్ రైలు వారానికి ఆరు రోజులు ఈ మార్గం గుండా వెళుతున్నా గద్వాలలో ఆగకపోవడం ఈ ప్రాంత ప్రయాణికులకు అందని ద్రాక్షగా మిగిలింది. ఇటీవల ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి. అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ గద్వాలలో వందేభారత్ రైలుహాల్ట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇవ్వడంతో ఈ ప్రాంత ప్రయాణికుల్లో ఆశలు చిగురించారు.

వందేభారత్‌ను ఆపాలి



గద్వాల మీదుగా వారానికి ఆరు రోజులు తిరిగే వందేభారత్ రైలును గద్వాల జంక్షన్‌లో హాల్ట్ చేయాలి. నడిగడ్డ ప్రాంతం నుంచి బెంగళూరుకు వెళ్లేవారు, అక్కడే స్థిరపడిన అనేక కుటుంబాలతో బంధుత్వాలు, వ్యాపార లావాదేవీలు ఎక్కువగా ఉన్నందున ఈ రైలు వల్ల అందరికీ ఉపయోగకరం గా ఉంటుంది.

\- ఎస్‌వీ రమణ, ఉపాధ్యాయుడు, గద్వాల

సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ను హాల్ట్ చేయాలి



బెంగళూరు నుంచి ఢిల్లీకి వెళ్లే సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు గద్వాల స్టేషన్‌లో హాల్ట్ ఏర్పాటు చేస్తే 50కిలోమీటర్ల దూరంలో ఉన్న రాయచూర్‌కు సౌకర్యంగా ఉంటుంది. రాయచూర్ మీదుగా ఢిల్లీకి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో సకాలంలో బెర్త్‌లు లభించని ప్రయాణికులకు గద్వాల స్టేషన్ మాత్రమే అందుబాటులో ఉంటుంది.

\- రాఘవేంద్ర రెడ్డి, రాయచూర్

ఆగని ప్రధాన రైళ్లు

ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణించే గద్వాల రైల్వేస్టేషన్‌లో ఇప్పుడిప్పుడే కొన్ని సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ఈ మార్గంలో వెళ్లే నాలుగు ప్రధాన రైళ్లు ఇక్కడ ఆగకపోవడం నిరాశను మిగిల్చింది. దశాబ్దాల పాటు ప్రజలు ఎదురుచూసిన గద్వాల - రాయచూర్ మార్గం 2012లో ప్రారంభమైనా ఇప్పటి వరకు ఆ మార్గం కేవలం ఒక ట్రిప్పు తిరిగే డెమో రైలుకే పరిమితమైంది. దేశ ఆర్థిక రాజధానిగా చెప్పుకునే ముంబయి, ఉమ్మడి రాష్ట్రానికి వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందిన విజయవాడను కలపడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటైన గద్వాల-రాయచూర్ మార్గాన్ని అనుకున్న స్థాయిలో వినియోగించుకోవడంలో రైల్వేశాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గద్వాల రైల్వే స్టేషన్ మీదుగా పలు ప్రధాన రైళ్లు వెళుతున్నా వాటికి ఇక్కడ హాల్ట్ లేక పోవడం సమస్యగా మారింది. దీంతో గద్వాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు కర్నూలు లేదా హైదరాబాద్‌కు చేరుకుని వెళ్లే అవకాశం ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గద్వాల రైల్వేస్టేషన్‌లో హాల్ట్‌లేని వాటిలో వారానికి ఒకసారి వెళ్లే హజ్రత్ నిజాముద్దీన్-కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, వారానికి రెండుసార్లు వెళ్లే యశ్వంత్‌పూర్-కోర్బా ఎక్స్‌ప్రెస్, వారానికి ఐదుసార్లు తిరిగే కర్ణాటక సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. వీటిలో యశ్వంత్‌పూర్ నుంచి గోరఖ్‌పూర్ రైలు (కాశీ) వారణాసికి వెళ్లే సౌకర్యం ఉన్నా గద్వాలలో హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. కర్ణాటక సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు గద్వాల హాల్ట్ ఉంటే తమకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందని రాయచూర్ ప్రాంతానికి చెందిన ప్రయాణికులు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టింపు లేకపోవడం గమనార్హం. ఈ ఎక్స్‌ప్రెస్ గద్వాలలో హాల్ట్ ఉంటే ఉత్తర కర్ణాటకలోని అతిపెద్ద వ్యాపార కేంద్రమైన రాయచూర్ ప్రాంత వ్యాపారులకు అనువుగా ఉంటుందన్నది వారి అభిప్రాయంగా ఉంది. వీటితో పాటు ఇటీవల కాచిగూడ నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్లే వందేభారత్ రైలును మహబూబ్‌నగర్ స్టేషన్ తర్వాత అతిపెద్ద స్టేషన్‌గా ఉండి, అత్యధిక ఆదాయాన్ని అందిస్తున్న గద్వాలలో ఆపడం వల్ల అటు రైల్వేకు ఆదాయం, ఇటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నది ప్రధానంగా వినిపిస్తున్న వాదన.

భక్తిశ్రద్ధలతో అబ్దుల్లాషా సాహెబ్ ఉర్సు



ఉర్సు ఉత్సవాలకు హాజరైన నాయకులు

మూసాపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని హజ్రత్ అబ్దుల్లాషా సాహెబ్ ఉర్సు మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామం నుంచి ఉర్సు గంధం ఊరేగింపుగా బయలుదేరి దర్గాకు చేరుకుంది. ఈ సందర్భంగా దర్గాలో మతపెద్దల సమక్షంలో గంధం, పూల సమర్పణ, నైవేద్యం, ఫాతేహా, దువా, సలాం కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కులమతాలకతీతంగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బాలయ్య, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజా మైనోద్దీన్, పెష్‌ఇమామ్ ముఖ్తార్‌అహ్మద్, మాజీ ఉప సర్పంచ్ ఎండీ కలీం, అబ్దుల్ ఖాదర్, నిరంజన్, ఖదీర్, ఖలీల్, ఆజం పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం

- ప్రారంభమైన అంజన్న ఉత్సవాలు



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మహమ్మదాబాద్ మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాదిర్యాల్ గ్రామంలో వీరహనుమాన్ ఆలయంలో హనుమత్ జయంతిని పురస్కరించుకొని అంజన్న ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభంగా ప్రారంభమైయ్యాయి. ఉదయం సుప్రభాత మహాగణపతి గౌరి పూజ కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభంకాగా, శివపార్వతుల కల్యాణం కనుల పండుగా నిర్వహించారు. అనతంరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నుంచి స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రామ్‌రెడ్డి, అంజలిలమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాములమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ అంజనాచారి పాల్గొన్నారు.

ఎన్నాళ్లిలా..?



- సొంతింటి కోసం పేదల ఎదురుచూపులు
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్రూం ఇళ్లు
- 90 శాతం నిర్మాణం పూర్తయినా మిగతా పెండింగ్ పనులు పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు

పనులు పూర్తి చేసి పంపిణీ చేయాలి..



నిరుపేదలకు ఇల్లు కట్టించి ఆదుకుంటామని పాలకులు గొప్పలు చెప్పడమే తప్పా ఆచరణలో పెట్టడం లేదు. జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ పనులను పూర్తి చేసి అర్హులైన నిరు పేదలకు పంపిణీ చేయాలి.

\- పొదిల రామయ్య, సీపీఎం మండల కార్యదర్శి, నాగర్‌కర్నూల్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కలను నిజం చేసేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లు పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారాయి. నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేసుకున్నా అర్హులైన వారికి అందించడంలో జాప్యం జరుగుతోంది. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వల్ల సామాన్యులు గూడు లేక అవస్థలు పడుతున్నామంటూ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

జిల్లా కేంద్రంలోని బస్ డిపో సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దాదాపుగా ఆరేళ్ల క్రితం ఒక్కో బాకులో 32 ఇళ్ల చొప్పున ఆరు బ్లాకుల్లో మొత్తం 192 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి పనులను ప్రారంభించారు. దాదాపుగా 90 శాతం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నా పెండింగ్ పనులు పూర్తి చేయడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. గదుల నిర్మాణం పూర్తయినా ప్లంబింగ్, ఫ్లోరింగ్, డోర్లు, కిటికీలకు గ్లాస్ ఫిటింగ్, విద్యుత్ వైరింగ్, పేయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గత పాలకుల అలసత్వం కారణంగా పెం డింగ్ పనులు పూర్తి చేసుకుని లబ్ధిదారులకు పంపిణీకి నోచుకోలేదు. ఇదిగో, అదిగో అంటూ ఊదరగొట్టి చివరకు తమకు ఇల్లు



జిల్లా కేంద్రంలోని ఊడగొట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల మెట్లపై పగులగొట్టిన మద్యం బాటిళ్లు

లేకుండా చేశారని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణ పనులు పూర్తి చేసుకుని లబ్ధిదారులకు అందకపోవడంతో పర్యవేక్షణ కరువై అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. డబుల్ ఇళ్ల అన్ని బాకుల్లో మద్యం సీసాలు, సిగరేట్ పాకెట్లతో దర్శనమిస్తున్నాయి. కొన్ని బ్లాకుల్లో కిటికీలను ధ్వంసం చేసి వాటికి బిగించిన ఇనుప చువ్వలను ఎత్తుకుపోయారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా జిల్లా కేంద్రంలో ఉన్న డబుల్ బెడ్రూం పెండింగ్ పనుల గురించి పట్టించుకోవడం లేదు. కనీసం ఇప్పటికైనా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న తమకు సొంతింటి కల నెరవేర్చాలని కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలోని ఊడగొట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల కిటికీ పెచ్చులు ఊడగొట్టిన దృశ్యం

ఆగని ఆర్థిక మోసాలు

- జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో అలజడి
- గత ఏడాది ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 50 కోట్లు కొల్లగొట్టిన సంస్థ
- తాజాగా రూ. కోటి అప్పు చేసి ఐపీ పెట్టిన వ్యాపారి

అయిజ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో ఆర్థిక మోసాలు ఆగడం లేదు. తాజాగా అయిజ పట్టణానికి చెందిన ఓ వ్యాపారి రూ. కోటికి పైగా అప్పులు చేసి, ఐపీ పెట్టి ఉడాయించాడు. దీంతో గత ఏడాది జరిగిన ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశం అయ్యింది. అయిజ పట్టణంలో గత ఏడాది మేలో ఓ వ్యక్తి కొందరు స్థానికులతో కలిసి 'ఏజీజీకే ట్రేడర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. నిర్వాహకులు తెలివిగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి పేరుతో దీన్ని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సంస్థ స్థానికంగా కొందరు ఏజెంట్లను నియమించుకున్నది. వారి ద్వారా తమ సంస్థలో రూ. లక్ష పెట్టుబడి పెడితే ప్రతీ నెల రూ. 20 నుంచి రూ. 40 వేల వరకు వడ్డీ ఇస్తామని చెప్పి ప్రజలను నమ్మించింది. ఇలా చాలా మందితో డబ్బు తీసుకున్న నిర్వాహకులు మరింత నమ్మకం కలిగించేందుకు కొందరికి పోస్ట్ డేటెడ్ చెక్కులు కూడా ఇచ్చారు. దీంతో చాలా మంది ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టారు. తీరా ఇదే ఏడాది ఆగస్టులో సదరు సంస్థ బోర్డు తిప్పేసింది. ఈ వ్యవహారంపై అయిజ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి గత ఏడాది అక్టోబరులో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తీరా కోట్ల రూపాయలు కొల్లగొట్టిన నిర్వాహకులు థాయ్‌లాండ్‌లో ఉన్నట్లు అప్పట్లో బాధితులే గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత ఏమయ్యిందో కానీ విషయం మాత్రం సద్దుమణిగింది.

తాజాగా మరో సంఘటన

గత ఏడాది జరిగిన సంఘటనను మరువక ముందే తాజాగా కోటి రూపాయలు అప్పు చేసి ఐపీ పెట్టిన వ్యాపారి ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆ వ్యాపారికి పట్టణానికి చెందిన ఒక ప్రముఖుడి కుటుంబ సభ్యులు పెద్దమొత్తంలో అప్పు ఇచ్చినట్లు తెలిసింది. తిరిగి చెల్లించాలంటూ వారు 10, 15 రోజులుగా ఆ వ్యాపారిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. లేకపోతే పోలీసులను ఆశ్రయించాల్సి వస్తోందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. దీంతో సమస్య పెద్దదవుతుందని భావించిన ఆ వ్యాపారి ఐపీ పెట్టినట్లు స్థానికంగా చర్చ కొనసాగుతోంది.

వ్యక్తం అవుతున్న అనుమానాలు

ఓ చిరు వ్యాపారికి పలువురు కోటి రూపాయల వరకు అప్పులు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అతడు 5, 10 రూపాయలు వడ్డీ ఎలా ఇవ్వ గలడని, ఇది కూడా ఆన్‌లైన్ ట్రేడింగ్ లాంటి వ్యవహారమేనా అని చర్చించుకుంటున్నారు. ఈ వ్యాపారి దాదాపు మూడు, నాలుగేళ్లుగా అధిక వడ్డీలకు అప్పులు చేయడం, గత ఏడాది ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యవహారం జరగడం చూస్తే రెండు సంఘటనల మధ్య లింకేమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అప్పుడు భర్త.. ఇప్పుడు కూతురు

\- మతిస్థిమితం లేక మట్టుపెట్టిన మహిళ



మృతి చెందిన చిన్నారి నవనీత

అచ్చంపేట టౌన్, (లింగాల) మే 20 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని తల్లి తన కూతురిని గొంతు నుమిలి నీటి సంపులో వేసి చంపిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం చెన్నంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేకల ఎలమ్మ, రాములు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. రెండవ కుమార్తె మేకల నవనీత (6)ను సోమవారం అర్ధరాత్రి తల్లి ఎల్లమ్మ గొం తునుమిలి నీటి సంపులో పడేసింది. కొంత సమయం తర్వాత నిద్రలేచిన మేకల రాములు తమ్ముడు మేకల కుర్మయ్య అమ్మాయి లేకపోవడంతో బయట వెతకగా నీటిసంపులో ఉన్న చిన్నారిని చూసి బయటకు తీశారు. అప్పటికే ఆ చిన్నారి మృతి చెందింది. మేకల ఎల్లమ్మ ఐదు నెలల క్రితం కూడా భర్త రాములును గొడ్డలితో నరికిచంపింది. ఆ ఘటనలో జైలుకు కూడా వెళ్లి వచ్చింది. ఆ సంఘటనను మరువక ముందే కూతుర్ని కూడా చంపడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకొని ఎల్లమ్మను అదుపులోకి తీసుకొని విచారిస్తు న్నట్లు ఎస్సై వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఆమెకు మతిస్థిమితం లేకపోవడం వల్లే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

పెద్దకొత్తపల్లి/ నాగర్‌కర్నూల్ క్రైం/ అలంపూర్ చౌరస్తా, మే 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ రసూల్ చెరువు వద్ద టీవీఎస్, బైక్ ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. సాతాపూర్ గ్రామానికి చెందిన బాయికాడి బాల్ చంద్రయ్య (50) టీవీఎస్‌పై గంట్రావుపల్లి స్టేజ్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్‌కు వెళ్తున్నాడు. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రానికి చెందిన గుర్తు తెయని వ్యక్తి (60) గ్లామర్ బైక్‌పై నాగర్‌కర్నూల్ వైపు వస్తున్నారు. రెండు వాహనాలు రసూల్ చెరువు సమీపంలో ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై ఉన్న వ్యక్తి తలకు తీవ్ర గాయం కావడంతో 108 అంబులెన్సులో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాలచంద్రయ్యను ఆటోలో పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కారు, టీవీఎస్ ఢీకొని..

నాగర్‌కర్నూల్ క్రైం (ఆంధ్రజ్యోతి) : టీవీఎస్ ఎక్స్‌ఎల్, ఇన్నోవా కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలం గట్టురాయిపాకులకు చెందిన చటమోని రాములు(40) మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చి ఇంటి తిరిగి వెళ్తుండగా, కొల్లాపూర్ చౌరస్తాలో ఇన్నోవా కారు ఢీకొన్నది. ప్రమాదంలో రాములు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై రాములు భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

అలంపూరు చౌరస్తా (ఆంధ్రజ్యోతి) : బైక్, ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఉండవల్లి ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా చనుగొండ్ల గ్రామానికి చెందిన కుమ్మరి మునిస్వామి అతడి స్నేహితులు సూర్యశేఖర్, మహేశ్, రాఘవేందర్‌లు రెండు బైక్‌లపై జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద టీ తాగేందుకు వచ్చారు. తిరిగి వెళ్తుండగా డూన్ దాబా వద్ద మునిస్వామి, సూర్యశేఖర్ వెళ్తున్న బైక్‌ను ఓ ప్రయివేటు ట్రావెల్ బస్సు అతి వేగంగా వస్తూ వెనుకనుంచి ఢీకొన్నది. దీంతో మునుస్వామి తలకు తీవ్ర గాయం కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. సూర్యశేఖర్ చెయ్యి మీద నుంచి టైర్ వెళ్లడంతో నలిగి పోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

మద్యం తాగొద్దన్నందుకు మహిళ ఆత్మహత్య

రాజాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మహబుబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొట్ట పద్మమ్మ (62) ప్రతీ రోజు కల్లు, మద్యం తాగుతుండేది. దీంతో మద్యం తాగొద్దని కొడుకు ఆమెను మందలించాడు. దీంతో సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె గ్రామ శివారులోని మర్రి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కాడెద్దు మృతి


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కాడెద్దు

బల్మూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండలం మైలారం గ్రామానికి చెందిన రైతు ఎల్లికంటి జగదీశ్వర్‌కు చెందిన కాడెద్దు సోమవారం రాత్రి కరెంట్ షాక్‌తో చనిపోయింది. ఎద్దును పొలంలో కట్టేసి ఇంటికి వెళ్లగా, అది తాడు తెంచుకొని వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై చనిపోయిందని రైతు తెలిపాడు. దాని విలువ రూ. 50 ఉంటుందని చెప్పాడు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం

మదనాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మదనాపురం మండలంలోని నెల్విడి గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని ఓ కోళ్ల ఫామ్ వద్ద మదనాపురం గ్రామానికి చెందిన వడ్డె మహేశ్ దాదాపు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

రేవల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో వరుసగా రెండవ రోజు అక్రమ ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం నాలుగు గంటల సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి ట్రాక్టర్ ను పట్టుకొని తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

లభించని రైతు ఆచూకీ


అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత

కృష్ణ, మే 20(ఆంధ్రజ్యోతి) : భీమా నదిలో మోటర్ ఫుట్‌బాల్ మరమ్మతు కోసం నీటిలోకి దిగిన రైతు జింకల తిప్పన్నను మొసలి లాక్కెళ్లి నాలుగు రోజులు గడిచినా అతడి ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత, ఎస్‌ఐ నవీద్ ఆధ్వర్యంలో అగ్నిమాపక దళం, రెస్క్యూ బృందం భీమానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. రైతు గల్లంతు అయిన ప్రదేశంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం మేఘాలు కమ్ముకోవడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. బుధవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

హడలెత్తించిన నాగు పాము


పామును పట్టుకుంటున్న స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సాగర్

వనపర్తి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మర్రికుంట గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం పెద్ద నాగుపాము కనిపించింది. పడగ ఎత్తి బుసలు కొడుతూ హడలెత్తించింది. గమనించిన పాఠశాల ఉపాధ్యాయుడు ఒకరు దాన్ని చేసి భయంతో కేకలు వేశాడు. దీంతో అది సమీపంలోని విద్యుత్ స్తంభం పక్కనున్న రంధ్రంలో దూరింది. ఆ ఉపాధ్యాయుడు స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించడంతో ఆయన అక్కడకు చేరుకున్నారు. చాకచక్యంగా పామును పట్టుకుని డబ్బాలో బంధించాడు. దానిని అటవీ ప్రాంతంలో వదిలేస్తానని ఆయన తెలిపారు.

మామిడి ఒరుగు.. సంపాదన మెరుగు


టబ్‌లో మామిడి కాయలు నింపుతున్న రైతు వెంకటయ్య


మామిడి కాయల ఒరుగు తయారీలో గ్రామస్థులు

- ఏపీ, కర్ణాటకల నుంచి కాయల దిగుమతి
- కోసి ఎండ బెట్టి, ఒరుగు చేసి ఎగుమతి
- పల్లె జనానికి రోజంతా కావలసినంత పని
- దాదాపు రెండు నెలల పాటు ఉపాధి


ఆరబోసిన మామిడి ఒరుగు

నవాబ్‌పేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : పల్లె జనానికి మామిడి ఒరుగు ఉపాధి చూపుతోంది. వేసవిలో దాదాపు రెండు నెలలు కడుపు నింపుతోంది. ఈ సీజన్‌లో సాధారణంగా గ్రామీణ ప్రజలు, ప్రధానంగా మహిళలు మామిడి పండ్లు విక్రయిస్తుంటారు. తోటలు ఉన్న రైతులు కొందరు నేరుగా ప్రజలకు పచ్చడి కాయలు అమ్ముతుంటారు. మరికొందరు మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. అందుకు భిన్నంగా మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల సరిహద్దు మండలాల్లో మామిడి ఒరుగు తయారు చేసి జీవనోపాధి పొందుతున్నారు.

ఒక వ్యక్తితో ప్రారంభం

ఒక వ్యక్తితో ప్రారంభమైన మామిడి ఒరుగు తయారీ ఇప్పుడు దాదాపు ఐదారు గ్రామాల్లో కొనసాగుతోంది. రుద్రారం గ్రామానికి చెందిన వెంకటయ్య గౌడ్ 12 ఏళ్ల క్రితం మామిడి ఒరుగు తయారీని ప్రారంభించాడు. అతడి స్ఫూర్తితో మరికొంత మంది ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఇలా చుట్టుపక్కల గ్రామాల్లోనూ విస్తరించింది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో 10 నుంచి 15 మంది మామిడి ఒరుగు తయారు చేయిస్తున్నారు. ఒక్కో వ్యక్తి వద్ద దాదాపు 30 మహిళలు పని చేస్తారు. వారంతా మామిడి కాయలను కోసి ముక్కలు చేసి ఎండ పెట్టి ఒరుగు తయారు చేస్తారు.

రూ. 50 వేల వరకు ఆదాయం

ఒరుగు తయారీకి అవసరమైన మామిడి కాయలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, అనంతపూర్, కర్ణాటకలోని బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటా రు. ఇంటిల్లిపాది కలిసి వాటిని ముక్కలుగా కోసి ఎండబెట్టి ఒరుగు తయారు చేస్తారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు కూడా తల్లి దండ్రులతో కలిసి ఈ పనిలో నిమగ్నం అవుతారు. తమ చదువుకు, పుస్తకాల కొనుగోలుకు అవసరమైన డబ్బు సంపాదించు కుంటారు. ఇలా సీజన్ ముగిసే వరకు ఒక్కో మహిళ రూ. 30 నుంచి రూ. 50 వేల వరకు సంపాదించు కుంటుంది.

ప్రస్తుతం రుద్రారం, రాంసింగ్ తండా, మరికల్, కన్మన్‌కాల్వ, కొత్తపల్లి తది తర గ్రామాల్లో మామిడి ఒరుగు తయారీ జోరుగా సాగుతోంది. గ్రామంలో ఎక్కడ చూసిన ఎండబెట్టిన ఒరుగు కనిపిస్తోంది. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో ఒరుగును నిజామాబాద్ జిల్లాకు తీసుకెళ్లి విక్రయిస్తారు. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలతో పాటు, దేశాలకు కూడా ఎగుమతి అవుతుంది.

అందరూ ఆలోచించాలి



ఎవరో వచ్చి పని చూపిస్తారని అనుకోవద్దు. అందుబాటులో ఉన్న పనులపై దృష్టి సారించాలి. స్వయం ఉపాధి దిశగా ప్రతీ ఒక్కరికీ ఉపాధి లభిస్తోంది. ఈ సీజన్‌లో మామిడి ఒరుగు తయారీతో ప్రతీ ఒక్కరికీ పని దొరుకుతుంది. వచ్చే డబ్బుతో కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చు. పిల్లల చదువులకు ఖర్చు చేసుకోవచ్చు.

- నవీన్ గౌడ్, రుద్రారం

ఉన్న చోటే ఉపాధి



ప్రతీ వేసవిలో మామడికాయల ఒరుగు తయారీతో మాకు ఉన్న చోటే పని దొరుకుతోంది. ఈ రెండు నెలల పాటు కష్టపడి పని చేసుకుంటాం. వచ్చిన డబ్బుతో కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతో పాటు, వ్యవసాయానికి ఉపయోగించుకుంటాం.

- అరుణమ్మ, రుద్రారం

ఇంటిల్లిపాదికీ పని



ఉపాధి పనులకు వెళ్తే సకాలంలో డబ్బు చేతికి రాదు. వంద రోజులు పూర్తయితే పని ఉండదు. కానీ ఒరుగు తయారీతో ఇంటిల్లిపాదికి పని ఉంటుంది. మా ఊర్లో చాలా మంది ఒరుగు తయారీతో లబ్ధి పొందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేసుకొని డబ్బు సంపాదించుకుంటున్నాం.

- పార్వతమ్మ, రుద్రారం

2డే క్రికెట్ టోర్నీలో పాలమూరు గెలుపు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్


గెలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ మే 20 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంట్రా డిస్ట్రిక్ 2 డే అండర్-23 క్రికెట్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు జడ్చర్లపై 49 పరుగుల ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది. తొలి ఇన్నింగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 420 పరుగులకు డిక్లేర్ చేసింది. నగరం సమీపంలోని తిరుమలహిల్స్‌లో గల సమర్థ పాఠశాల మైదానంలో మంగళవారం జరిగిన రెండో ఇన్నింగ్స్‌లో 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 206 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో కేతన్‌కుమార్ 106 బంతుల్లో 16 ఫోర్లతో సెంచరీ (101) సాధించాడు. సంజయ్ 45 పరుగులు చేశాడు. 49 పరుగుల ఇన్నింగ్స్ తేడాతో పాలమూరు గెలిచింది. జట్టులో శశంక్ 2, షాదాబ్‌అహ్మద్ 2, డేవిడ్ క్రిపాల్ 1 వికెట్ తీశారు. బోనస్‌తో ఒకటితో కలిపి మహబూబ్‌నగర్ 6 పాయింట్లు సాధించింది.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని సమర్థ పాఠశాల మైదానంలో జరుగుతున్న అండర్-23 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ రెండో రోజు పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, కోచ్ గోపాలకృష్ణ, సీనియర్ క్రీడాకారుడు ఆబిద్‌హుసేన్ పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌కు తల్లీబిడ్డలు

- ఉపాధి కోసం జడ్చర్లకు వలస వచ్చిన దంపతులు
- గొడవ పడి భార్యను వదిలేసి వెళ్లిపోయిన భర్త
- గత డిసెంబరులో మగ బిడ్డకు జన్మనిచ్చిన సంజన
- ఇద్దరినీ కోల్‌కతాలోని శక్తిసదన్‌కు తరలింపు


పశ్చిమబెంగాల్‌కు చెందిన సంజన, పసిపాపను జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం నుంచి కోల్‌కత్తాలోని డైరెక్టరేట్ ఆఫ్ సోషల్‌వెల్‌ఫేర్ శక్తిసదన్‌కు తరలిస్తున్న సఖి సెంటర్ అడ్మిన్ సౌజన్య, సిబ్బంది

జడ్చర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ బెంగాల్‌కు చెందిన దంపతులు జీవనోపాధి కోసం మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లకు వలస వచ్చారు. వారిద్దరి మధ్య గొడవ జరగడంతో భర్త ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటికే గర్భవతిగా ఉన్న ఆమె మొగ బిడ్డకు జన్మనిచ్చింది. స్థానికంగా ఏ దిక్కు లేని వారిద్దరినీ మహబూబ్‌నగర్ సఖి కేంద్రం నిర్వాహకులు పశ్చిమబెంగాల్‌కు పంపించారు. సఖి కేంద్రం అడ్మిన్ సౌజన్య తెలిపిన వివరాల మేరకు... పశ్చిమబెంగాల్ రాష్ట్రం, సౌత్ 24 పర్గణాస్, గంగాసాగర్ గ్రామానికి చెందిన సంజన, లక్కీ దంపతులు జీవనోపాధి కోసం గత ఏడాది డిసెంబరులో జడ్చర్ల మండలం పెద్దపల్లికి వలస వచ్చారు. ఆ సమయంలో సంజన గర్భవతిగా ఉంది. కాగా భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భర్త లక్కీ సంజనను వదిలేసి స్వగ్రామానికి వెళ్లిపోయా డు. గత ఏడాది డిసెంబరు 31న ఆమెకు పురుటి నొప్పులు రావడంతో ఇరుగు, పొరుగు వారు జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను ఆ సుపత్రిలో చేర్చారు. ఆ తర్వాత పుట్టిన బాబును విక్రయించేందుకు ప్రయత్నిస్తోందన్న అనుమానంతో స్థానికులు సఖి కేంద్రం నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో వారు సంజనతో పాటు పుట్టిన బాబును జనవరి 4న తమ అధీనంలోకి తీసుకుని జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు. జనవరి 8వ తేదీ వరకు తమ అధీనంలో ఉన్న సంజన, పసి పాపలను జిల్లా కేంద్రంలోని స్టేట్‌హోంకు తరలించారు. ఆ తర్వాత డీడబ్ల్యూవో జరీనాబేగం సహకారంతో పశ్చిమబెంగాల్ డైరెక్టరేట్ ఆఫ్ సోషల్ వెల్‌ఫేర్ అధికారులను సంప్రదించారు. కానీ సంజన కుటుంబ సభ్యుల వివరాలు తెలియలేదు. దీంతో తల్లీబిడ్డలను కోల్‌కతాలోని శక్తిసదన్‌లో లాంగ్‌టర్మ్ షెల్టర్ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. అందుకోసం తల్లీబిడ్డలను మంగళవారం జిల్లా కేంద్రం నుంచి పశ్చిమబెంగాల్‌కు పంపించారు.

తగ్గిన ఎండల తీవ్రత

వనపర్తి/నారాయణపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత కొద్దిగా తగ్గింది. ఐదు రోజులుగా వాతావరణం చల్లబడింది. రెండు రోజులకు ఒకసారి మోస్తరు వర్షం కురుస్తుండటంతో ఒక్కసారిగా ఎండ తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగింది. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠం 37.0 డిగ్రీలు, కినిష్ఠం 28.3 డిగ్రీలు.

వనపర్తి జిల్లా మదనా పూర్ మండలంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.6 డిగ్రీలు, కనిష్ఠం పీపనగండ్లలో 25.9 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 35 డిగ్రీలు, కనిష్ఠం 27 డిగ్రీలు, నారాయణపేట, నాగర్‌కర్నూలు జిల్లాల్లో గరిష్ఠం 33 డిగ్రీలు, కనిష్ఠంగా 24 డిగ్రీలు నమోదైంది.

జాతీయ స్థాయికి ఎదగాలి

- డీవైఎస్‌వో శ్రీనివాస్


నెట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలిచిన జిల్లా జట్టును అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 20(ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ ఆకాంక్షించారు. జనగాంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి మిక్స్‌డ్ సబ్ జూనియర్ టోర్నీలో మహబూబ్‌నగర్ బాలుర జట్టు స్వర్ణ పతకం, నెట్‌బాల్ 4వ ఫాస్ట్ - 5 తెలంగాణ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ బాలికల జట్టు కాంస్య పతకం సాధించాయి. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను డీవైఎస్‌వో అభినందించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఖాజాఖాన్, కోచ్ అంజద్‌అలీ, షరీఫ్ పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్‌లో నాగర్‌కర్నూల్ జట్టు విజయం


నాగర్‌కర్నూల్ క్రికెట్ లీగ్‌లో విజయం సాధించిన జిల్లా జట్టు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 క్రికెట్ లీగ్ టోర్నమెంటులో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు విజయం సాధించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఏబీసీ మైదానంలో నిర్వహిస్తున్న టోర్నీలో రెండవ రోజు నాగర్‌కర్నూల్, వనపర్తి జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వనపర్తి జట్టు 39.1 ఓవర్లలో 138 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు నిర్ణీత ఓవర్లలో 127 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో వనపర్తి జట్టు 74 పరుగులు చేసింది. 75 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నాగర్‌కర్నూల్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను ఛేదించి విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు సాధించిన బౌలర్ నిరంజన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కార్యక్రమంలో లీగ్ మ్యాచ్ నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జి సతీశ్, కోచ్ అభిజిత్, వనపర్తి జట్టు ఇన్‌చార్జి జయశంకర్, మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి మొహమ్మద్ మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

వేసవికాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- నారాయణస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు, పెద్దకొత్తపల్లి



పెద్దకొత్తపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా ఆరోగ్యం పట్ల ప్రత్యేక తీసుకోవాలని పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నారాయణస్వామి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

వేసవికాలంలో ఎక్కువగా ఏఏ వ్యాధులు వ్యాపిస్తాయి?

వేసవికాలంలో వాంతులు, విరేచనాలు, గొంతునొప్పి వంటి వ్యాధులు ఎక్కువగా వస్తాయి. దీని మూలంగా వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

దవాఖానాలో ప్రజలకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు?

మాతా, శిశు సంక్షేమ కార్యక్రమంలో భాగంగా చిన్న పిల్లలకు టీకాలు వేయడం, కాన్పులు చేస్తాం. ఎన్‌సీడీ ప్రోగ్రాంలో బీపీ, షుగరు వ్యాధిగ్రస్తులకు పరీక్ష నిర్వహించి మందులు అందజేస్తాం. సాధారణ వ్యాధులకు మందులు ఇస్తాం.

దవాఖానాలో ప్రతీనెల ఎన్ని ప్రసవాలు అవుతున్నాయి?

పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ నెల 3 నుంచి 5వరకు కాన్పులు చేస్తాం.

దవాఖానాలో పాము, కుక్కకాటుకు మందులు ఉన్నాయా?

పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యంలో పాము కాటుకు, కుక్క కాటుకు మందులు అందుబాటులో ఉన్నాయి.

న్యూస్ బాక్స్

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం చెయొద్దు

- అదనపు కలెక్టర్ అమరేందర్

కొల్లాపూర్, మే 20(ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలుదారులు నిర్లక్ష్యం వీడి తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ అమరేందర్ ఆదేశించారు. మంగళవారం కొల్లాపూర్ మార్కెట్ యార్డును ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. మార్కెట్ యార్డులో రైతులతో ఆయన మాట్లాడారు. తేమ శాతం ఉన్న వరిని కొనుగోలు కేంద్రాలలో ఆపకుండా వెంటనే కొనుగోలు చేసి లారీల్లో లోడ్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ మేనేజర్ రాజేందర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు కిందికి దూసుకెళ్లిన లారీ

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

తాడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర సమీపంలో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న లారీ రోడ్డు దిగి వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. దాదాపు రోడ్డు నుంచి 100మీటర్ల దూరం వరకు దూసుకుపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పొలంలో పనులు చేసుకుంటున్న రైతులు లారీ వెళ్తున్న పరిస్థితిని చూసి కంగుతిన్నారు. లారీకి ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ ఎలాంటి ప్రమాదం తలెత్తలేదు.

నర్సరీలపై శ్రద్ధ వహించాలి

చారకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిపల్లిలో నర్సరీని ఎంపీవో వెంకటేష్‌తో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వానాకాలం నాటికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని అన్నారు. మొక్కలకు రోజు రెండు పూటలా నీళ్లు పెట్టి చనిపోకుండా చూడాలని అన్నారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

కల్వకుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ బాలింత మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన స్థానికుల కథనం ప్రకారం... వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన గర్భిణి రేణుక(23)ను మొదటి కాన్పు కోసం కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆదివారం కుటుంబీకులు తీసుకొచ్చారు. ఆసుపత్రిలో సీజేరియన్ అనంతరం పాప జన్మించగా తల్లికి రక్తం తక్కువకావడంతో వైద్యులు రక్తం ఎక్కించారు. సోమవారం బాలింత ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. దీంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి కుటుంబీకులు తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృత్యువాత పడింది. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని వసతులు కలిగిన ప్రైవేటు పాఠశాలలు ఈ నెల24లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రావణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన జిల్లాలోని ప్రవేటు పాఠశాలల యాజమాన్యం డీఈవో, డీఎస్‌ఈ గుర్తింపు ఉత్తర్వులు, పాఠశాల మేనేజ్‌మెంటు వివరాలు, తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య, ఎస్సీ విద్యార్థుల సంఖ్య, గత ఐదేళ్లుగా పదో తరగతి ఉత్తీర్ణత, మొదటి శ్రేణి ఉత్తీర్ణత అయిన వారి సంఖ్య తదితర వివరాలతో నిర్ణీత తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోని పాఠశాలలు ఈ విద్యా సంవత్సరంలో రిన్యువల్ చేయబడవని ఆయన తెలిపారు.

ఎర్రమన్ను గుట్టలు మాయం

- రాత్రి, పగలు తరలిస్తున్న మట్టి మాఫియా
- పట్టించుకోని అధికారులు
- అధికారులు చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- బీజేపీ మండల అధ్యక్షుడు లింగన్నగౌడ్



మట్టిని తరలిస్తున్న టిప్పర్



రాత్రి వేళల్లో మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

కోడేరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గుట్టలు మట్టిమాఫియా ధన దాహానికి మాయమైపోతున్నాయి. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం వల్లేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. మండల కేంద్రంలోని ఊరగుట్ట రోజు రోజుకు అంతరించిపోతోంది. మట్టి మాఫియా రాత్రి, పగలు తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి ట్రాక్టర్లు,



మండల కేంద్రంలోని ఊరగుట్ట దగ్గర గోదాము పక్కన మట్టిని తవ్విన ఎక్స్‌కవేటర్

టిప్పర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక నాయకుల అండదండలతో మట్టి మాఫియా ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. కొందరు స్థానికులు మట్టి తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఎవరి ముడుపులు వారికి ఇస్తున్నాం, మట్టిని తరలిస్తాం, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని మట్టి మాఫియా బాహాటంగా చెబుతున్నదని స్థానికులు అంటున్నారు. మండలంలోని ఊరగుట్టతో పాటు నల్లగుట్టలు, నాగులపల్లి, కోడేరు మధ్యన గల ప్రభుత్వ భూమిలో ఉన్న గుట్టల మట్టిని తరలిస్తున్నారు. పంట కాలువ సైడ్ మట్టిని సైతం తరలిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువలు పటుత్వం కోల్పోతే, వర్షాకాలంలో నీరు పారే సమయంలో కాలువలు తెగిపోయి, పంట పొలాలు మునిగి, పంటలు దెబ్బతింటాయని రైతులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులు మట్టి తరలిస్తున్న వాహనాలపై ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. మట్టి తరలింపును అధికారులు నిలువరించకపోతే ఆధారాలతో అవినీతి అధికారుల వేతనం నుంచి రికవరీ చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు లింగన్నగౌడ్ హెచ్చరించారు.

పోలీసులకు ఫిర్యాదు చేశాం : తహసీల్దార్

మంగళవారం ఊరగుట్ట ప్రాంతాన్ని పరిశీలించామని, అక్కడ మట్టిని తీస్తున్న ఎక్స్‌కవేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

చర్యలు తీసుకుంటాం : ఎస్‌ఐ

తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించామని ఎస్‌ఐ గోకారి తెలిపారు. విచారణ చేపట్టామని, బాధ్యులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతామని ఎస్‌ఐ తెలిపారు. నిబంధనలు పాటించని వారిని ఉపేక్షించబోమని అన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతే కాంగ్రెస్ ధ్యేయం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాల ఆరోగ్య భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దాపూర్ గ్రామానికి చెందిన నెంట చరణ్‌కు చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ మంజూరయ్యింది. ఈ మేరకు మంగళవారం మంజూరైన రూ.34వేల చెక్కును బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే అందజేశారు. విద్య, ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ, నాయకులు శ్రీనునాయక్, రాములుయాదవ్ ఉన్నారు.

కొండారెడ్డిపల్లిలో సీఎం సోదరుడి పూజలు



ఆలయ సన్నిధిలో స్థానిక నాయకులతో ఎనుముల తిరుపతిరెడ్డి

వంగూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కొండారెడ్డిపల్లికి వచ్చిన తిరుపతిరెడ్డిని స్థానిక నాయకులు పూలమాల శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, ఎనుముల రాజశేఖర్‌రెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ శిశుపాల్‌రెడ్డి, రాములు యాదవ్, కృష్ణారెడ్డి, అనిల్, వంశీ, జంగయ్య, వెంకటయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

ఆ కార్యాలయంలో సమాచారం అంత ఈజీగా దొరకదు

- ఆర్‌టీఏ కార్యాలయంలో పేపర్లు మాయం
- సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసిన ఎమ్మెల్సీకి లభించని పూర్తి సమాచారం

నాగర్‌కర్నూల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు రవాణా సంస్థలో చోటు చేసుకుంటున్న అనేక పరిణామాలు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేకు ఆగ్రహం తెప్పిస్తున్నాయి. రోడ్డు రవాణా సంస్థ కార్యాలయంలో అధికారుల పనితీరుపై అనేక విమర్శలు వచ్చిన నేపథ్యంలో వివిధ వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి కొంత సమాచారం కోరుతూ రాతపూర్వకంగా ఆర్‌టీఏను కోరారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్ని వాహనాలు ఓటింగ్ కోసం సమకూర్చారు. వాటికి ఎంత చెల్లించారనే అంశంపై ఎమ్మెల్సీ స్థాయిలో నేరుగా సమాచారం అడిగినప్పటికీ రోడ్డు రవాణా సంస్థ నుంచి సంపూర్తిగా సమాధానం రాలేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఏ వాహనానికి ఎంత చెల్లించారనే విషయంలో ఎమ్మెల్సీ పూర్తి సమాచారం అడగగా ఆ డాక్యుమెంట్లు తమ వద్ద లేవని, ఎవరికీ ఎంత చెల్లించారో అధికారికమైన పత్రాలు లేవని రోడ్డు రవాణా శాఖ అధికారులు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డికి సమాధానమివ్వడం గమనార్హం.

అసెంబ్లీ ఎన్నికల చెల్లింపులకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు : ఆర్‌టీఏ

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి వాహనాలకు చెల్లించిన అద్దెల విషయంలో ఎలాంటి సమాచారమూ అందుబాటులో లేదని ఆర్టీఏ నాయక్ అన్నారు. అప్పట్లో తాను రవాణాశాఖ అధికారిగా లేనని, అయినా పూర్తి సమాచారం సేకరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

రూ. లక్ష కోట్లతో అభివృద్ధి ఏమైంది ?

- బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుగంటి భరత్ ప్రసాద్



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న భరత్ ప్రసాద్

అచ్చంపేటటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రూ. లక్ష కోట్లతో పాలమూరు జిల్లాను అభివృద్ధి చేస్తామన్న మాట ఏమైందని బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుగంటి భరత్ ప్రసాద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌తో కలిసి భరత్ ప్రసాద్ మాట్లాడారు. ఇందిర గిరిజల వికాసం పథకం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పీఎం సూర్యఘర్ సౌర పథకమేనన్నారు. నిజంగా నల్లమల ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధి ఉంటే నల్లమలలో ప్రాజెక్టుల ప్రస్తావన ఎందుకు చేయలేదని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌తో భారతసైన్యం చూపెట్టిన పరాక్రమాన్ని, ధైర్యసాహసాలను కీర్తిస్తూ ఈ నెల 23న నిర్వహించే తిరంగా యాత్రలో కుల, మతాలకు అతీతంగా నాయకులు, పెద్దలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, నాయకులు ముక్తాల రేణయ్య, శ్రీను నాయక్, సైదులు యాదవ్, బల్మూరి జానకి, మండలాల అధ్యక్షుడు నీలం రవి, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం

కొల్లాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుల ప్రాంగణంలో వచ్చే నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై కొల్లాపూర్ బార్ అసోసియేషన్ ఏజీపీ, ఏపీపీలు పోలీస్ శాఖ, బ్యాంకు అధికారులతో మంగళవారం కోర్టు ప్రాంగణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ నసీం సుల్తానా, జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్ ఉపనిషద్వాణి, కొల్లాపూర్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో సన్నాహక సమావేశం కొనసాగింది. లోక్ అదాలత్ సెక్రటరీ నసీం సుల్తానా మాట్లాడుతూ న్యాయవాదులు అందరూ పెం డింగ్‌లో ఉన్న రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీపీలు పోలీసు అధికారులతో బ్యాంకు అధికారులతో కేసుల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలని కోరారు.ఈ సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోతుల నాగరాజు, లోక్‌అదాలత్ సభ్యులు కురుమూర్తి, మోహన్‌లాల్, న్యాయవాదులు భాస్కర్ రెడ్డి, నజీరుద్దీన్, నిరంజన్, రాజు, రామలక్ష్మమ్మ, మల్లయ్య, ముబీన్, ఏపీపీలు జుబేదా, శిరీష, సబ్ ఇన్‌స్పెక్టర్లు హృషికేష్, సతీష్, గోకారి, రామన్ గౌడ్, ఎక్సైజ్ అధికారులు, పోలీస్ కానిస్టేబుల్స్ లోక్ అదాలత్ సిబ్బంది కేశవరెడ్డి, భోగ హరికృష్ణ హాజరయ్యారు.

మాచారంలో సీఎం సభ విజయవంతంపై హర్షం

అమ్రాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మాచారంలో సోమవారం ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న భారీ బహిరంగ సభ విజయవంతం కావడం పట్ల డీసీసీ కార్యదర్శి కే రేణయ్య హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన అమ్రాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అనారోగ్య పరిస్థితులను లెక్కచేయకుండా మాచారంలో సీఎం సభ విజయవంతం కోసం తీవ్రంగా కృషి చేశారన్నారు.

ఆలేరులో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

తెలకపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని ఆలేరు గ్రామంలో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ చరణ్‌తే, సాయి కావ్య తదితరులు మాట్లాడుతూ వ్యవసాయంపై రైతులు తగిలిన చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధ్యమని వారన్నారు. రైతుల కొనుగోలు చేసిన విత్తనాలను వాటికి సంబంధించిన రసీదులను భద్రపర్చుకోవాలని వ్యవసాయ అధికారులు ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, మాజీ ఎంపీటీసీలు ఈశ్వరయ్య, గ్రామ రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై సూచనలు

తిమ్మాజిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వర్షాకాలం సీజన్‌లో వేసే పంటల వివరాలు ఆయా పంటలకు సంబంధించి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ప్రతీ వారం జరిగే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధిక దిగుబడులు వచ్చే పంటల వివరాలు వివరిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, ఏఈవోలు సాయిరాం, శివ కుమార్, అబ్దుల్ నవాజ్, నాస్మిన్, సాహితఉన్నారు.

23న రైతులకు అవగాహన

బల్మూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఈ నెల 23న తుమ్మన్‌పేట గ్రామంలోని రైతు వేదికలో సమావేశం ఉంటుందని వ్యవసాయ అధికారి నరేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

అభయుడి ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు

ఊర్కొండ, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో గణపతి, నవగ్రహ విగ్రహాలు, ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ పురస్కరించుకొని హంపీ పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య, విద్యారణ్య భారతిస్వామిలచే రెండవ రోజు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల పూజలు, హోమాలు, నిర్వహించారు. విగ్రహాలకు విశేష ధాన్యాధివాసం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయం ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కార్య నిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, వేద పండితులు రాజుశర్మ, దత్తాత్రేయశర్మ, మహేష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాసశర్మలు ఉన్నారు.

రీజియన్‌లో మొదటి స్థానంలో నిలుద్దాం

- ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆర్టీసీ డీఎం ఉమా శంకర్ పిలుపు

కొల్లాపూర్, మే 20(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డిపోలోని అన్ని విభాగాల ఉద్యోగస్తుల సమష్టి కృషితో కొల్లాపూర్ డిపోను ఈ ఆర్థిక సంవత్సరంలో రీజియన్‌లోనే మొదటిస్థానంలో నిలపడానికి కృషి చేద్దామని కొల్లాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమాశంకర్ ఉద్యోగులను కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఉద్యోగులను ఉద్దేశించి మేనేజర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రయాణికులతో సత్ప్రవర్తన కలిగి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని డ్రైవర్లకు కండక్టర్లకు హితవు పలికారు. ఆదర్శ ఉద్యోగులుగా ప్రతీ నెల ఎంపికవుతున్న ఉద్యోగస్తుల మాదిరిగానే మిగిలిన ఉద్యోగస్తులు కూడా ఎంపికక కావడానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఏప్రిల్‌లో అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్, ఉద్యోగస్తులకు నగదు పురస్కారాలను, ప్రతిభ కనబరిచి అత్యధిక ఇన్సెంటివ్ తీసుకున్న కండక్టర్, అత్యధిక ఇంధనాన్ని పొదుపు చేసిన డ్రైవర్ ఉద్యోగస్తులతో పాటు మెకానికల్ సిబ్బందికి ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ రత్నమ్మ, ట్రాఫిక్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, కార్యాలయ సూపరింటెండెంట్ నజీర్, మెకానికల్ సూపర్ వైజర్ షఫీ ఉల్లా, ఏడీసీ గౌసుద్దీన్, ట్రాఫిక్, మెకానికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించాలి

- ఇంటర్వ్యూల గురించి సమాచారం లేదంటున్న హాజరుకాని అభ్యర్థులు

తెలకపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. ఇంటర్వ్యూల తేదీల గురించి తమకు సరైన సమాచారం లేదని, మేసేజ్‌లు కూడా పెట్టలేదని పేర్కొన్నారు. సమాచారం లేకుండా ఇంటర్వ్యూలు నిర్వహించడం వలన, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న తమకు నష్టం జరుగుతుందన్నారు. దాదాపు 800మంది ఇంటర్వ్యూలకు హాజరు కాలేదని, వారందరికీ నిర్వహించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

మళ్లీ నిర్వహించే అవకాశం లేదు : ఎంపీడీవో

రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించే అవకాశం లేదని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. సాధ్యమైనంత వరకు అన్ని సమాచారం మాధ్యమాల ద్వారా తెలియజేశామని, చివరి వరకు పేపర్ల ద్వారా, సోషల్ మీడియా ద్వారా సమాచారం అందించామని, మళ్లీ ఇంటర్వ్యూ నిర్వహించే అవకాశం లేదన్నారు.

రోగులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

- జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణ



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణ

ఉప్పునుంతల, మే 20 (ఆంధ్రజ్యోతి) : రోగులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది రోగుల పట్ల సంయమనంతో మెలగాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్వప్న, నర్సింగ్ ఆఫీసర్ ఉఫత్, నిర్మల, సందీప్, కుమారాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలువురు రైతులను రుణాల పేరుతో భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్న హైదరాబాదుకు చెందిన కౌశిక్‌రెడ్డి, నందకుమార్, జగదీశ్వర్‌రెడ్డి, స్వప్న అనే వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లోని సుమారు 30 మంది రైతులు పంటల సాగు కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించేందుకు వెళితే, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, ఈసీ సభ్యుడు పృథ్వీరాజ్, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, మధు, కళ్యాణ్, రామకృష్ణ, బాధిత రైతులు బాలు, నాగులు, పరశురాములు, ఎంజానాయక్, మల్లేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య



కల్వకుర్తి : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్ టౌన్/ కల్వకుర్తి/ కొల్లాపూర్/ బల్మూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేం ద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్మికులు నిర సన వ్యక్తం చేశారు. ఒకవైపు నిత్యా వసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుతూ ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దేశభక్తి గురించి మాట్లాడే కనీస అర్హత లేదని విమర్శించారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మధు, కార్మికులు వెంకటమ్మ, జయ, కృష్ణవేణి, సుగుణ పార్వతి, రేణుక, అలివేల, కృష్ణయ్య, వెంకటయ్య, బాలస్వామి, నాగయ్య, సుధాకర్, వెంకటస్వామి, మల్లేష్ పాల్గొన్నారు.

● కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

కొల్లాపూర్ : సీఐటీయూ నాయకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొల్లాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

కార్మిక సంఘాలపై కేంద్ర ప్రభుత్వం పెడుతున్న ఆంక్షలు ఎత్తివేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ కార్యదర్శి వెంకటయ్య, డిపో కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ బస్ డిపో ముందు నల్ల బ్యాడ్జీలతో డిపో కార్మికులు నిరసన తెలిపారు.

బల్మూరులో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ఎంఈవో ఇమ్మానుయేల్



కొల్లాపూర్‌లో ఎఫ్ఎల్ఎన్ ప్రాథమిక స్థాయి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో ఇమ్మానుయేల్

కొల్లాపూర్/ తిమ్మాజిపేట/ వెల్దండ/ పెద్దకొత్తపల్లి/ కోడేరు/ పెంట్లవెల్లి/ అమ్రాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో ఎఫ్ఎల్ఎన్ ప్రాథమిక స్థాయి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఎంఈవో ఇమ్మానుయేల్ వెల్లడించారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం చేప ట్టిన ఎఫ్ఎల్ఎన్ ప్రాథమిక స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడానికి ఈ శిక్షణ కార్యక్ర మాలు ఉపయోగపడతాయని అన్నారు. రిసోర్స్ పర్సన్ల పర్యవేక్షణలో అట్టహాసంగా శిక్షణ తర గతులు కొనసాగాయి. కార్యక్రమంలో వివిధ సబ్జెక్టుల ఎమ్మార్పీలు, కొల్లాపూర్ మండల ప్రాథమిక స్థాయి ఉపాధ్యా యులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

● తిమ్మాజిపటలోని జడ్పీహెచ్ఎస్‌లో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు బోధన సామర్థ్యాలను పెంపొందించడానికి శిక్షణ తగరతులను ఎంఈవో సత్యనారాయణశెట్టి ప్రారంభించారు.

● వెల్దండలోని జడ్పీహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు ఏర్పాటుచేసిన వృత్యంత శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో చంద్రుడు ప్రారంభించారు.

● పెద్దకొత్తపల్లిలోని ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

● కోడేరులోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఎల్ఎఫ్ఎల్, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో భాస్కర్‌శర్మ ప్రారంభించారు.

● పెంట్లవెల్లిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఎస్జీటీ, ఎల్ఎఫ్ఎల్, హెచ్ఎంలకు శిక్షణ శిబిరాన్ని ఎంఈవో ఇమ్మానుయేల్ ప్రారంభించారు.

● అమ్రాబాద్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శిక్షణ కోఆర్డినేటర్, మండల విద్యాధికారి బాలకిషన్ ప్రారంభించారు.